కార్మికులకు అండగా ఉంటా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి ఎల్లప్పుడు అండగా ఉంటామని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ప్లంబర్స్ డే సందర్భంగా మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ప్లంబర్స్‌కు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, అనిల్‌చౌదరి, నర్సింహారావు, సతీష్‌కుమార్, రవిముదిరాజ్, రాఘవేందర్, మనోజ్, కృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న కేటీఆర్, సుధీర్‌రెడ్డి

నాగోలు: మూసారంబాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితా అజీజ్ రెడ్డి కుమారుడు కనిష్క్ రెడ్డి ఓఆర్‌ఆర్ రోడ్డు ప్రమాదంలో ఐదు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం నాగోలు పీబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన కనిష్క్‌రెడ్డి దిన కర్మ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరై కనిష్క్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు.

నియామకం

రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా బానాల తిరుమల్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 7న ప్రకటన విడుదల చేసింది. తిరుమల్ రెడ్డి 1991 నుంచి న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ ఇది వరకు ఎల్‌బీనగర్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా సేవలందించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడంపై ఆయన ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

కల్తీ నూనె తయారీదారుడి అరెస్ట్

చాదర్‌ఘాట్: గడువు ముగిసిన నూనె ప్యాకెట్లపై వివరాలు తొలగిస్తూ, లైసెన్స్ లేకుండా నూనె ప్యాకెట్లను రీప్యాక్ చేస్తున్న ఓ వ్యాపారిని పోలీసులు అరెస్ట్ చేశారు. మలక్‌పేట మార్కెట్‌లో గణేష్ బాలాజీ లద్కాటర్ ఆయిల్ దుకాణం యజమాని కాచిగూడలో నివసించే అశోక్‌కుమార్ అగర్వాల్ (51) తన దుకాణంలో గడువు ముగిసిన ఆయిల్ ప్యాకెట్లపై సిబ్బందితో వైట్నర్ సహాయంతో వివరాలు చెరిపి వినియోగదారులకు అమ్మడమే కాకుండా, అనుమతులు లేకుండా నూనెలను రీప్యాక్ చేస్తున్నాడు. సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి మంగళవారం దుకాణంపై దాడులు నిర్వహించి అశోక్‌కుమార్ అగర్వాల్‌ను అరెస్టు చేశారు.

చైన్ స్నాచర్ రిమాండ్

నాగోలు: వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు తెచ్చుకొని పారిపోయిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ వివరాల ప్రకారం..హయత్‌నగర్ పరిధిలోని మర్రిపల్లికి చెందిన వాడేగోని స్వరూప(70) ఇంటి వద్దనే ఉంటుంది. ఇది గమనించిన యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, భూక్యాతండాకు చెందిన భూక్యా శ్రీనివాస్(25) సోమవారం ఉదయం స్వరూప నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి దూరి ఆమెకు చున్నీతో బిగించి మెడలో ఉన్న రెండు వరుసల బంగారు పుస్తెల తాడును తెంచుకుని ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రెండు బృందాలుగా ఏర్పాడి సీసీ ఫుటేజీల ఆధారంగా మంగళవారం అరెస్టు చేసి బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకుని శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించారు.

సరూర్‌నగర్ ఠాణాను సందర్శించిన సీపీ



చైతన్యపురి: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మంగళవారం సాయంత్రం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా స్వయంగా ఫిర్యాదుదారుల స్పందన తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్, పెట్రోలింగ్, సీసీటీవీ నిర్వహణ వంటి పలు విభాగాల పనితీరును ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

రెండేళ్లన్నారు..
నాలుగేళ్లవుతోంది..

- సైదాబాద్‌లో నత్తనడకన స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు
- అసంపూర్తి పనులతో పెరిగిన ట్రాఫిక్ సమస్య
- పూర్తయితే సాఫీగా ప్రయాణం



చంచల్‌గూడ చౌరస్తా వద్ద వంతెన నిర్మాణం



సైదాబాద్ రహదారిపై నిలిచి పోయిన పనులు

సైదాబాద్: నగరంలో కొనసాగుతన్న పై వంతెనలు, స్టీల్‌బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తయితే ట్రాఫిక్ చిక్కులు లేకుండా సాఫీగా రాకపోకలు సాగించవచ్చని వాహనదారులు, స్థానికులు పేర్కొంటున్నారు. నగరం నుంచి మలక్‌పేట నల్గొండ చౌరస్తా మీదుగా ఒవైసీ కూడలి వైపుగా రక్షణ రంగ సంస్థలు, శంషాబాద్ విమానాశ్రయానికి, శ్రీశైలం, కర్నూల్ వైపు, ఐఎస్‌సదన్ నుంచి తెలంగాణ, ఏపీలోని పలు జిల్లాలకు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మలక్‌పేట ఫైర్‌స్టేషన్ సమీపంలోని రాష్ట్ర ప్రెస్ కార్యాలయం నుంచి చంచల్‌గూడ చౌరస్తా, సైదాబాద్ పాత ఏసీపీ కార్యాలయం, ధోబీఘాట్, ఐఎస్‌సదన్ చౌరస్తా, సంతోష్‌నగర్ మీదుగా ఉండే ఈ రహదారిపై నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటుంద.ఇ సైదాబాద్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 2020లో అప్పటి ప్రభుత్వం స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌ఆర్‌డీపీ) ఆధ్వర్యంలో ఈ రహదారిలో స్టీల్ వంతెన నిర్మించాలని అప్పటి మంత్రి కేటీఆర్ సైదాబాద్‌లో స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు.

రెండున్నర కిలోమీటర్లు..

రెండేళ్లలో సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు అప్పుడే బహిరంగంగానే ప్రకటించారు. సుమారు రెండున్నర కిలోమీటర్లు దూరం ఉండే ఈ రహదారిపై ప్రయాణించడానికి వాహనదారులకు ఇక్కడి ట్రాఫిక్ సమస్య కారణంగా చాలా సమయం పడుతుంది. స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయితే కేవలం నిముషాల వ్యవధిలో ప్రయాణం సాఫీగా సాగిపోతుందని వాహనదారులు సంతోషపడ్డారు. కానీ వారి ఆనందం ఎంతో సేపు నిలువలేదు. రెండు సంవత్సరాల కాలవ్యవధిలో పూర్తవుతుందని మొదలుపెట్టిన సైదాబాద్ స్టీల్ వంతెన పనులు నాలుగేళ్లు అయినా ఇంకా కొనసాగుతూనే ఉంది. కనీసం సగం పనులు కూడా పూర్తి కాక పోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ వివాదం..

స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు సైదాబాద్ రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ దేవాలయం మీదుగా వెళ్తుండటంతో వివాదానికి దారితీసింది. స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రతిపాదిత అలైన్‌మెంట్ ప్రకారం కాకుండా ఎవరికో లబ్ధి చేకూర్చేందుకు ధర్మానికి విరుద్ధంగా ఆలయం పైనుంచి వంతెన వెళ్లే విధంగా అలైన్‌మెంట్ మార్చారని ఆలయ కమిటీ ప్రతినిధులు, పలు హిందూ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. తమ ప్రాణాలు పోయినా పర్వాలేదు, ధర్మానికి విరుద్ధంగా ఆలయంపై నుంచి నిర్మాణం వెళ్లనీయమని భీష్మించడంతో సమస్య జఠిలమయింది. పాత అలైన్‌మెంట్ ప్రకారమే వంతెన నిర్మించాలని పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. దీంతో ఏడాదిన్నర ఇక్కడ పనులు నిలిచిపోయాయి.

స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ వివరాలు..

నిర్మాణం: గవర్నమెంట్ ప్రెస్ కార్యాలయం నుంచి ఒవైసీ కూడలి వరకు 91 పిల్లర్లతో
పొడవు: 2.58 కిమీ.
కారిడార్ పొడవు: స్టీల్ బ్రిడ్జ్ వంతెనకు ఇరువైపులా నిర్మించే ర్యాంపులతో కలిసి 3.39 కిమీ.
వెడల్పు: వంతెనపై ఇరువైపులా రెండేసి చొప్పున మొత్తం నాలుగు లైన్లు
అంచనా వ్యయం: 2020లో రూ. 523.37 కోట్లు, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మార్చిన అంచనా వ్యయం రూ. 620 కోట్లు
ఆస్తుల సేకరణ వ్యయం: రూ. 153.37 కోట్లు

పనులు ఆగటంతో మరింతగా ట్రాఫిక్ సమస్య

ప్రభుత్వ ప్రెస్ కార్యాలయం నుంచి ఒవైసీ హాస్పిటల్ కూడలి వరకు నిర్మించ తలపెట్టిన వంతెన పనులు నిలిచిపోయాయి. ప్రెస్ కార్యాలయం నుంచి చంచల్‌గూడ చౌరస్తా, పాత ఏసీపీ కార్యాలయం చౌరస్తా, సైదాబాద్ ప్రధాన రహదారిపై కొంతమేర వరకు వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ధోబీఘాట్ చౌరస్తా, ఐఎస్‌సదన్ చౌరస్తా వరకు కొంత పిల్లర్లు నిర్మాణం జరిగాయి. పనులు నిలిచిపోవడంతో సైదాబాద్ రహదారిపై ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. నిత్యం ఈ రహదారి మీదుగా ఉదయం సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగులు, దూరప్రాంతాలకు వెళ్లే వాహనాలతో రహదారి కిక్కిరిసిపోతుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం నిర్మిస్తున్న వంతెననే మరింత ట్రాఫిక్ చిక్కులకు కారణంగా మారిందని పలువురు ఆగ్రహానికి గురవుతున్నారు.

ప్రత్యామ్నాయంతో కుదిరిన సయోధ్య..

వంతెన నిర్మాణం ఆలయం మీదుగా పోతుంది. ప్రస్తుతం అలైన్‌మెంట్ మార్చే పరిస్థితి లేదు. అందుకని అధికారులు మధ్యే మార్గంగా ఆలయానికి వెనుక వైపున్న ఒకరి సొంత స్థలాన్ని కొనుగోలు చేసి ఆలయానికి అదనంగా కేటాయించేలా ప్రతిపాదన చేసారని తెలిసింది. ధర్మరక్షణ కోసం అంటూ భీష్మించిన నిరసన కారులు సైతం ప్రత్యామ్నాయ స్థల కేటాయింపు ప్రతిపాదనకు తలొగ్గినట్లు సమాచారం. ఏది ఏమైనా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి ఇక అడ్డంకులు తొలిగాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



గ్రీన్ పార్క్ కాలనీలో పర్యటిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: కాలనీల్లోని సమస్యలు పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీలో మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డితో కలిసి పర్యటించగా వివిధ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా బాక్స్ డ్రైయిన్ పనులు పూర్తయినా రోడ్ల మరమ్మతులు చేపట్టలేదని నాలాలలో పూడికతీత పనులు చేపట్టాలని కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలలో రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామని, నాలాలలో పూడికతీత పనులు ఎప్పటికప్పుడు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట డీఈ రవిచంద్, ఏఈ విజయ్‌కుమార్, నాయకులు సుధీర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కాలనీ వాసులు జగన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అంజనేయులు,కాశీనాథ్, సుధాకర్, మధుసూదన్, సువర్ణ ఉన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హస్తినాపురం: డివిజన్ పరిధి డిఫెన్స్ కాలనీలోని శ్రీ హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, అఖండ దీప స్థాపన, దీక్షధారణ, కంకణధారణ, నవగ్రహ హోమం, నిత్య పూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసుధన్‌రెడ్డి, చైర్మన్ వంగ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ డైరెక్టర్ సందీప్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, దశరథగౌడ్, రమేష్‌గౌడ్, విఘ్నేశ్వర్‌రెడ్డి, హరికృష్ణగుప్తా, సూర్య ప్రకాష్, శ్రీనివాస్, నిర్మలేష్ పాల్గొన్నారు.

చర్చిల పాలన కాపరుల సంక్షేమానికి కృషి



సమావేశంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

సైదాబాద్: చర్చిల పాలన కాపరుల సంక్షేమానికి తెలంగాణ బాప్టిస్ట్ చర్చ్ కౌన్సిల్ (టీబీసీసీ) కృషి చేస్తుందని సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ భాగ్యానంద్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ శిఖామణి తెలిపారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ పాస్టర్ ఆర్. భీముడు నాయక్ ఆధ్వర్యంలో టీబీసీసీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో చర్చిల నిర్మాణం కొనసాగుతుందన్నారు. చర్చి కాపరుల సహాయనిధి ఏర్పాటు చేశామని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో వేదాంత విద్య, చిల్డ్రన్ మినిస్ట్రీకి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అనంతరం సభ్యులు డెక్కన్ రీజియన్ ఆఫ్ సికింద్రాబాద్ తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డెక్కన్ రీజియన్ ఆఫ్ సికింద్రాబాద్ తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోషియేషన్ నూతన అధ్యక్షుడిగా రెవ.డాక్టర్ డీ.జకారియా, ఉపాధ్యక్షుడిగా రెవ.కె.జయ్‌కుమార్, కార్యదర్శిగా గోపాల్ నాయక్, జాయింట్ సెక్రటరీగా ఎం.జోసఫ్, కోశాధికారిగా జె.బాలాసింగ్, సంయుక్త కోశాధికారిగా సీహెచ్.కృష్ణపాల్, జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా ఆర్.భీముడు నాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా జి.విజయ్‌కుమార్, కె.మాణిక్యరావు, బి.మణికంఠ ఎన్నికయ్యారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌నాయక్‌కు అవార్డు

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ వీబీ కమలహాసన్‌రెడ్డి చేతుల మీదుగా మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌నాయక్ క్యాష్ అవార్డు తీసుకున్నారు. మంగళవారం నగరంలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మెదక్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓగా 2017 కల్లులో కలిపే 4 కిలోల అల్‌ప్రాజోలమ్ పట్టుకున్నారు. సాక్ష్యాధారాలతో చార్జిషీట్‌ను మెదక్ సెషన్స్ కోర్టుకు అందజేశారు. ఈ కేసులో పట్టుబడిన వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో క్యాష్ అవార్డు అందజేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



కమలాహాసన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న గోపాల్‌నాయక్

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు



ఎల్‌బీనగర్ చౌరస్తాను పరిశీలిస్తున్న జెడ్సీ, కార్పొరేటర్లు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ఎల్‌బీనగర్ చౌరస్తాలో మంగళవారం ఆయన కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ చౌరస్తా చుట్టు పక్కల ఉన్న ఆక్రమణలను ఇప్పటికే తొలగించడం జరిగిందని, రోజు వేల సంఖ్యలో ప్రయాణికులు ఎల్‌బీనగర్‌కు వచ్చి నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్తారని వారికి మరిన్ని సౌకర్యాలు కలిపించడంతో పాటు చౌరస్తాలో సేదతీరేలా రూపు దిద్దుతామన్నారు. ఎల్‌బీనగర్ డీమార్ట్ వద్ద వన్ వే చేయడంతో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఆసుపత్రుల్లో వైద్యుల కొరత

ఎల్‌బీనగర్: గత రెండు నెలలుగా పీహెచ్‌సీలలో వైద్యులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సాహెబ్‌నగర్ బస్తీ దవఖానా, ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. డ్యూటీ నర్సే వైద్య చేస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి వైద్యులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మలక్‌పేట నల్లగొండ క్రాస్‌రోడ్డులోని దివ్యాంగుల నేషనల్ పార్కు అభివృద్ధిపై ఎమ్మెల్యే బలాల సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్కులో ప్రత్యేక అవసరాల కోసం ఏర్పాట్లు, వసతులపై అధికారులతో చర్చించారు. పార్కులో మెరుగైన సౌకర్యాల కల్పన కోసం అవసరమైన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ డీపీఓ అయేషా రుబీనా, డైరెక్టర్ డాక్టర్ సుమేరియా, సర్కిల్-6 ప్రాజెక్టు ఆఫీసర్ యుగంధర్ రెడ్డి, ఫెడ్ అధ్యక్షుడు గంగారామ్, సెక్రటరీ జనరల్ చెరుకు నాగభూషణం పాల్గొన్నారు. అనంతరం ఆయన నియోజకవర్గ పరిధిలోని పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

కాలనీ అభివృద్ధికి కృషి



నగేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లే ఔట్ కాలనీ సంక్షేమ సంఘానికి నిర్వహించిన ఎన్నికల్లో మరోసారి పెండ్యాల నగేష్ అధ్యక్షుడిగా గెలిపొందారు. ప్రధాన కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా మల్లికార్జున్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రాలేఔట్ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల సహకారంతో కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



స్లాబును కూల్చుతున్న సిబ్బంది

చంచల్‌గూడ: అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం కొరడా ఝుళిపించారు. ఛావణి డివిజన్‌లో అనుమతులు లేకుండా ఆమీర్ మోహియుద్దీన్ అనే వ్యక్తి 200 గజాల్లో 6 అంతస్తులు నిర్మిస్తున్నాడని సయ్యద్ సోహేల్ జీహెచ్‌ఎంసీలో ఫిర్యాదు చేసి హైకోర్టును ఆశ్రయించాడు. నిర్మాణం ఆపాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని నెలల తర్వాత మళ్లీ పనులు మొదలుపెట్టడంతో సోహేల్ మరోసారి హైకోర్టును ఆశ్రయించడంతో అక్రమ నిర్మాణాలను కూల్చి నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశాలతో మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు భవనాన్ని పాక్షికంగా కూల్చారు.

ఎన్‌డీసీ సర్వేకు సహకరించండి



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తరుణి

చాదర్‌ఘాట్: నాన్ కమ్యూనికల్ డిసీజ్ (ఎన్‌డీసీ) సర్వేకు సహకరించాలని ఓల్డ్‌మలక్‌పేట యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ తరుణి కోరారు. మంగళవారం ఆమె యూపీహెచ్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. డివిజన్‌లో 17 వేల మందిని 30 సంవత్సరాలు పైబడిన వారిని బీపీ, షుగర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ కోసం ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఈ సర్వే ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సర్వేలో రోగులను గుర్తించి వారి ఆధార్ కార్డుల ద్వారా మందులు జారీ చేస్తామని ఇప్పటి వరకు పది వేల మంది వివరాలు సేకరించామన్నారు. మొట్టమొదటి సారిగా ఈ సర్వే హైదరాబాద్ జిల్లాలో విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రామేశ్వరి, డీఈఓ ఖలీల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కొఠారీ కమిషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించటంతో పాటు విద్యాశాఖ మంత్రిని నియమించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) జిల్లా కార్యదర్శి సామిడి వంశివర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశాడు, మంగళవారం హయత్‌నగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు కావస్తున్నా ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నిర్లక్ష్యం చేస్తే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి అరుణ్ కుమార్, సభ్యులు శ్రావణి, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంశివర్ధన్‌రెడ్డి

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం



పనులు ప్రారంభిస్తున్న అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీలలోని అంతర్గత రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మాధవనగర్ కాలనీలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, తిరుమలరెడ్డి, అపర్ణ, నీలిమ, మానిక్‌రెడ్డి, మాధవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలి

నాగోలు: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం నిర్వహించిన హై మౌంట్ నేషనల్ పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆయన చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, నాగేశ్వరరావు, మురళీకృష్ణ, జాన్‌మియ, నాయకులు మంచి రాజేష్, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పవన్ కుమార్